
సాక్షి ఒడిశా

బుధవారం। 26। జూన్ 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.74,428

వెండి 8 గ్రాముల 220 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ప్రజా ప్రయోజిత బడ్జెట్ రూపొందించాలి

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రజా ప్రయోజిత బడ్జెట్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంబంధిత అధికారులకు మంగళవారం సూచించారు.

- 8లో



కుక్కల స్వైర విహారం

జయపురం పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

'సమస్యలు పరిష్కరించండి'



మున్సిపల్ చైర్మన్ కును నాయిక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: స్థానిక ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్నటువంటి శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరించాలని ఐకాన్ ఇన్ మొషన్ యువజన సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సంస్థ ప్రతినిధుల బృందం సభ్యులు మున్సిపల్ చైర్మన్ కును నాయక్‌ని అతని కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ శ్మశానవాటికలో అనేక సమస్యలు ఉన్నాయని అతనికి తెలియజేశారు. విద్యుత్ లైట్లు లేక రాత్రి పూట కర్మకాండకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కర్రల నిల్వ గది లేకపోవడంతో అత్యవసరంగా వచ్చే సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. వర్షాకాలం కర్రలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్నానం గదుల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. శ్మశానవాటిక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి సిబ్బందిని తరుచూ పంపించాలని కోరారు. చైర్మన్‌ని కలిసినవారిలో సంస్థ సభ్యుడు, న్యాయవాది సంతోష్ మిశ్ర, రణేంద్ర ప్రతాప్ త్రిపాఠి, కె.నాగేంద్ర సుబుద్ధి తదితరులు ఉన్నారు.

సీసీ కెమేరాల ఏర్పాటుకు సన్నాహాలు



సీసీ కెమేరాల ఏర్పాటుకు సర్వే చేస్తున్న అధికారులు

రాయగడ: పారిశ్రామి ప్రాంతమైన టికిరిలో సీసీ కెమేరాల ఏర్పాటుకు రంగం సిద్ధమయ్యింది. స్థానికంగా ఉన్నటువంటి బృహత్తర పరిశ్రమ ఉత్కళ అలూమిన ఇంటర్నేషనల్ లిమిటెడ్ (యూఏఐఎల్) వీటిని ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తోంది. ఈ మేరకు ఆ కంపెనీ అధికారి సత్యానంద సింహ, టికిరి పోలీసుస్టేషన్ ఏఎస్ఐ భరత్ పయికొ, మున్నాబెహర, సమాజ సేవకులు హరప్రసాద్ నాయక్ తదితరులు సీసీ కెమేరాల ఏర్పాటుకు సంబంధించి సోమవారం సర్వే చేపట్టారు. పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందుతున్న టికిరిలో దొంగతనాలు, దోపిడీలు, ట్రాఫిక్ వంటి సమస్యలను అధిగమించేందుకు కెమేరాలు ఏర్పాటు చేయనున్నట్లు యూఏఐఎల్ అధికారి సింహ తెలియజేశారు. టికిరిలోని బస్టాండుతో పాటు మరో ఆరు ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసేందుకు స్పాట్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. మరో రెండు నెలల్లోగా వీటిని గుర్తించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

సెల్‌ఫోన్ దోచుకున్న వ్యక్తులు అరెస్టు



అరెస్టైన సెల్‌ఫోన్ దొంగలు

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మలో ఒక డెలివరీ బాయ్‌కు కత్తి చూపించి భయపెట్టి, అతడి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్ దొంగిలించిన ఇద్దరు యువకులను బొరిగుమ్మ పోలీసులు పట్టుకున్నట్లు బొరిగుమ్మ పోలీసు అధికారి జుగళ కిశోర్ షా వెల్లడించారు. నవరంగపూర్‌లోని ఒక సంస్థలో డెలివరీ బాయ్‌గా జగన్నాథ్ గదబ పని చేస్తున్నాడు. సోమవారం అతడు కొన్ని వస్తువులు డెలివరీ చేసేందుకు బొరిగుమ్మ వచ్చాడు. ఆ సమయంలో ఇద్దరు దుండగులు జగన్నాథ్ వద్దకు వచ్చి కత్తిచూపి అసభ్య భాషతో తిడుతూ అతడి వద్దనున్న సెల్‌ఫోన్ దోచుకుపోయారు. వెంటనే జగన్నాథ్ బొరిగుమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన జరిగిన కొన్ని గంటల్లోనే పోలీసులు నిందితులను పట్టుకున్నారు. ఒక నిందితుడు టుటు నాయిక్‌ను బంగ్లాగుడలో అరెస్టు చేశారు. మరో నిందితుడిని పోలీసు వెంబడిస్తూ పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అయితే నిందితుడు చంద్రనాయిక్ కత్తితో పోలీసుపై దాడి జరిపాడు. ఈ సంఘటనలో పోలీసు డ్రైవర్ మనోరంజన్ బెహర స్వల్పంగా గాయపడ్డాడు. అయితే చంద్ర నాయిక్‌ను పోలీసు చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్‌తో పాటు కత్తిని స్వాధీన పరచుకున్నట్లు వెల్లడించారు.

వేదిక ఒక్కటి.. వేడుకలు మూడు..!



రథ చక్రాలకు రంగు పూత

- శ్రీమందిరంలో ఒకేరోజు మూడు వేడుకలు
- రథయాత్రతో పాటు నవ యవ్వన అలంకరణ, నేత్రోత్సవం
- పాలకమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్ర ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి గాంచినది. స్వామివారి యాత్ర నిర్వహణ కోసం అనుబంధ యంత్రాంగం కొన్ని నెలలబాటు నిరవధికంగా శ్రమిస్తుంది. అశేష భక్తజనం ఏడాది పొడవునా స్వామి రథోత్సవంలో పలు ఘట్టాలను కనులారా తిలకించాలని నిరవధికంగా నిరీక్షిస్తారు. యాత్రకు చిట్టచివరి పక్షం రోజులు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రథయాత్రకు 15 రోజులు ముందుగా జ్యేష్ట పూర్ణిమ పురస్కరించుకుని మూల విరాటులకు జలాభిషేకం నిర్వహిస్తారు. ఈ యాత్ర తర్వాత స్వామి అస్వస్థతకు గురై పక్షం రోజుల పాటు తెరమరుగై భక్తులకు దర్శనం లభించదు. మరోవైపు స్వామి ఆరోగ్యంపై భక్తజనంలో వర్ణనాతీతమైన ఆందోళన స్వామిని త్వరగా కనులారా తిలకించాలని ఉత్సాహపరుస్తుంది. ఆరోగ్యంతో కోలుకున్న స్వామివారు నవ యవ్వన అలంకార శోభతో భక్తుల ముందు ప్రత్యక్షం కావడంతో నేత్రోత్సవం జరుగుతుంది. నిత్య నూతన శోభతో స్వామి దర్శనం కనుల పండువ. సాధారణంగా రథయాత్ర ముందు రోజున భక్తులకు నవ యవ్వన దర్శనం లభిస్తుంది. నవ యవ్వన శోభితుడు రథాలపైకి వెళ్లే అపురూప దృశ్యం పాహండి చేరువ నుంచి తిలకించేందుకు ప్రత్యేక అర్జిత దర్శనం సౌలభ్యం కల్పిస్తారు.



అంచెలంచెలుగా తయారవుతున్న యాత్రరథం

భక్తులకు దర్శనం నిలిపివేత

అయితే ఈ ఏడాది భక్తులకు ఈ భాగ్యం లేకుండా పోతుంది. రథయాత్రకు ముందు నవ యవ్వన దర్శనం, పాహండి అర్జిత దర్శనం లభించే అవకాశం లేదు. యాత్ర నిర్వహణ సారథ్యం వహించే 36 నియోగుల సంఘం ప్రముఖుల ప్రతిపాదన మేరకు ఈ ఏడాది నవ యవ్వన దర్శనం, అర్జిత పాహండి సాధారణ భక్తులకు నివారించారు. నియోగి ప్రముఖుల ప్రతిపాదనకు శ్రీ జగన్నాథ ఆలయ పాలక మండలి ఆమోదించినట్లు మంగళవారం ప్రకటించింది. పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు దేవస్థానం ప్రధాన పాలన అధికారి వీర్ సురేంద్ర యాదవ్ తెలిపారు.

ఎందుకిలా..?

శ్రీమందిరం పంచాంగ గణాంకాల ప్రకారం ఈ ఏడాది రథయాత్ర రోజున నవ యవ్వన అలంకరణ, నేత్రోత్సవం కూడా నిర్వహించాల్సి ఉంది. మూడు ఉత్సవాలను ఏకకాలంలో నిర్వహిస్తూ భక్తులకు యథాతథంగా దర్శనం కల్పిస్తే ఉత్సవ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అందువలన ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో భక్తులకు నవ యవ్వన దర్శనం, అర్జిత పాహండి నివారించాలని 36 నియోగుల ప్రముఖులు పాలక మండలికి ప్రతిపాదించారు. వీరి ప్రతిపాదనలను పాలక మండలి ఆమోదించింది.

53 ఏళ్ల తర్వాత...

ఇటీవలి కాలంలో 53 ఏళ్ల తర్వాత ఇటువంటి అపురూప ఘట్టం చోటు చేసుకుంటుంది. లోగడ చివరి సారిగా 1971 సంవత్సరంలో రథయాత్ర రోజున నేత్రోత్సవం, నవ యవ్వన అలంకరణ జరిగాయి. తిరిగి ఈ ఏడాది ఈ పరిస్థితి పునరావృతం అవుతుంది. అలాగే
స్వామివారి తెరచాటు గోప్య సేవల నిడివి కుదించారు. ఏటా మాదిరిగా 15 రోజులు కాకుండా 13 రోజులకు పరిమితం చేయాలని నియోగుల సంఘం ప్రతిపాదించింది. ఈ లెక్కన దైతపతి సేవకుల వైద్య, చికిత్స సేవలు సాధారణం కంటే 2 రోజులు ముందుగా ముగించాల్సి ఉంటుంది.

స్వర్ణాలంకారం జాప్యం

స్వామి రథయాత్ర ఆద్యంతం భారీ మార్పు, చేర్పులతో ముడిపడింది. యాత్ర ముగింపు ముందు రోజున రథాలపై మూల విరాటుల స్వర్ణ అలంకార దర్శనం సర్వ జనులకు లభిస్తుంది. గుండిచా నుంచి రథాలు శ్రీ మందిరం సింహద్వారం ఆవరణకు చేరిన మర్నాటి సంధ్య వేళలో ఈ అలంకరణ చేపట్టడం ఆచారం. ఈ ఏడాది 2 రోజుల తర్వాత రథాలపై మూల విరాటులకు స్వర్ణ అలంకరణ చేపడతారు. జులై 15వ తేదీన మారు రథయాత్ర బహుడా నిర్వహిస్తారు. రెండు రోజుల తర్వాత జులై 17న రథాలపై మూల విరాటులకు స్వర్ణాలంకరణ చేయాలని 36 నియోగుల సంఘం ప్రతిపాదన మేరకు పాలక మండలి నిర్ణయించింది. పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రథయాత్ర మొదలుకొని నీలాద్రి విజే వరకు కార్యాచరణపై దృష్టి సారించారు. సమావేశంలో ఆలయ ప్రధాన కార్యనిర్వహణ అధికారి(సీఏఓ) వీర్ విక్రమ్ యాదవ్, పూరీ జిల్లా మేజిస్ట్రేట్ సిద్దార్థ్ శంకర్ స్వయిం, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రథయాత్ర ఆలస్యం

పంచాంగ తిథుల ప్రకారం ఈ ఏడాది స్వామివారి రథయాత్ర ఆలస్యంగా ప్రారంభమవుతుంది. శ్రీమందిరం సింహ ద్వారం ముంగిట నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా మందిరం అడపా మండపానికి స్వామివారి నవదిన యాత్ర వార్షిక రథ యాత్రగా కొనియాడతారు. సంధ్య వేళ సరికి రథాలు గుండిచా మందిరం ఆవరణకు చేరుకోవడం ఆచారం. ఈ ఏడాది యాత్ర రోజున ఒకేసారి 3 ఉత్సవాలు నిర్వహించాల్సి ఉన్నందున రథయాత్ర ఆరంభం వేళని సర్దుబాటు చేయాలని 36 నియోగుల సంఘం చేసిన ప్రతిపాదనకు పాలక మండలి ఆమోదించింది. ఈ ఆమోదం ప్రకారం ఈ ఏడాది స్వామియాత్ర సాయంత్రం 5 గంటలకు ఆరంభం అవుతుంది. భక్త జనం రథాలు లాగి గుండిచా గమ్యానికి చేర్చుతారు. అయితే రథాలు ఆలస్యంగా బయల్దేరడంతో ఈ ఏడాది రథ యాత్ర నిరవధికంగా రెండు రోజులు జరుగుతుంది. భక్తజనం వరుసగా 2 రోజులు స్వామివారి రథయాత్రలో పాల్గొనే అవకాశం కలిసి వచ్చింది.



చక్రాల పట్టు బిగింపు



అంతస్తుల వారీగా రథాల తయారీ



రథ అంతస్తుల తయారీ



తొలి దశ రథం

ఖుర్దారోడ్ స్టేషన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణం

- రూ.191 కోట్ల వ్యయ ప్రణాళిక
- రైల్వేశాఖ ఆమోదం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ స్టేషన్‌లో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టుకు రైల్వేశాఖ ఆమోదం తెలిపింది. ఈ స్టేషనులో పెరుగుతున్న రైలు ట్రాఫిక్ మరియు రద్దీ నివారణకు ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌గా రైల్వే శాఖ మంజూరు చేయడం విశేషం. తూర్పు కోస్తా రైల్వే (ఈకోర్) హౌరా, చెన్నై ప్రధాన రైలు మార్గం, ఖుర్దా రోడ్, పూరీ బ్రాంచ్ లైన్‌లో రైలు కార్యకలాపాలను సులభతరం చేయడానికి ఫ్లైఓవర్ వంతెన దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు కోసం గతంలో ప్రతిపాదించారు. 7.41 కి.మీ పొడవునా ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణానికి రూ.191.87 కోట్లు ఖర్చవుతుందని అంచనా. భారతీయ రైల్వే ఎనర్జీ కారిడార్ స్కీమ్ కింద ఈ ప్రాజెక్ట్‌కు మంజూరు లభించింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రైల్ మార్గంలో రైలు కదలికల సామర్థ్యాన్ని, రద్దీ నివారణ నైపుణ్యాన్ని పెంచుతుందని భావిస్తున్నారు.



రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నమూనా

పూరీకి మార్గం సుగమం

దీనివలన పశ్చిమ బెంగాల్, దక్షిణాది ప్రాంతాల నుంచి పూరీ గమ్యం చేరాల్సిన రైళ్లకు మార్గం సుగమం అవుతుంది. ఈ దిశల్లో పూరీ చేరాల్సిన రైళ్లు ఖుర్దా రోడ్ స్టేషన్‌లో అధిక సమయం నిరీక్షించాల్సిన పరిస్థితులు అనివార్యంగా కొనసాగుతున్నాయి. ఉభయ దిశల నుంచి ఖుర్దారోడ్ చేరిన ఇతర ప్రాంతాల ప్రయాణికుల రైళ్ల కదలికని ప్రభావితం చేయకుండా పూరీ మార్గం రైళ్లని మళ్లించడంలో తలెత్తుతున్న దైనందిన సమస్యలు తొలగిపోతాయి. రైల్వే శాఖ తాజా ఆమోదంతో నిర్మితం కానున్న ఫ్లైఓవర్ వంతెనతో పూరీ గమ్యానికి రైళ్ల సకాలంలో చేరేందుకు దీర్ఘకాలిక సమస్య తొలగిపోతుంది. మరోవైపు హౌరా, చెన్నై ప్రధాన రైలు మార్గం, ఖుర్దా రోడ్, పూరీ బ్రాంచ్ లైన్ రెండింటిలోనూ రైళ్ల సగటు వేగం మెరుగుపడి కార్యాచరణ సామర్థ్యం పుంజుకుంటుంది. ఈ మార్గాల్లో వచ్చిపోయే రైళ్లకు అంతరాయం తొలగిపోతుంది. సుదూర ప్రాంతపు ప్రయాణికులు సకాలంలో గమ్యం చేరేందుకు వీలవుతుంది. ఖుర్దా రోడ్ రైల్వే స్టేషన్ ఒక ప్రధాన జంక్షన్, వివిధ రైలు కదలికలను నిర్వహిస్తుంది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం భువనేశ్వర్ - బరంపురం, ఖుర్దా రోడ్ -పూరీ రైలు సెక్షన్లలో ఏక కాలంలో రైళ్ల కదలికలను సులభతరం చేస్తుంది. గతంలో పూరీ వైపు నుండి క్రాస్ ట్రాఫిక్‌ను అనుమతించడానికి ఖుర్దా రోడ్‌లో రైలు కదలికలను స్తంభింపజేయాల్సి వచ్చేది. దీనివలన ఆలస్యం మరియు కార్యాచరణ అసమర్థత సమస్యలు తలెత్తేవి.

ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎంపీ బలభద్ర మఝి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం నూతన పార్లమెంట్ భవనంలో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన ఒడిశా ఎంపీ బర్తహరి మొహతాబ్ వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నబరంగ్‌పూర్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ పార్టీ తరుపున గెలిచిన బలభద్ర మఝి ఒడియా భాషలో ప్రమాణం చేశారు. చివరిలో నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తి పీఠం బండారు ఘరణి దేవికి జేజేలు పలికారు. కొరాపుట్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన సప్తగిరి ఉల్క కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

రహదారులు రక్తసిక్తం

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు దుర్మరణం పాలయ్యారు. కొందరి నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం ప్రాణాలను బలి కొన్నాయి. దీంతో రహదారులపై రవాణా భద్రతా నియమాలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. వాహనాలను నెమ్మదిగా నడిపి ప్రాణాలను కాపాడుకోవాలని సూచిస్తున్నారు.

- వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృతి

జయపురం/కొరాపుట్: టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన లమతాపుట్ సమితి మాలిపెట గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో లమతాపుట్‌కు దాదాపు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాలిపేట గ్రామ సమీపంలో ఒక బైక్‌ను జయపురం నుంచి వస్తున్న ఒక టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందాడు. మరణించిన వ్యక్తి కొరాపుట్ సదర్ పోలీసు స్టేషన్ ముసిలిముండ గ్రామానికి చెందిన జ్యోతీంద్ర కులదీప్‌గా గుర్తించారు. ప్రమాదం సమాచారం అందుకున్న లమతాపుట్ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కులదీప్‌ను లమతాపుట్ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. అలాగనే కులదీప్‌ను బైక్‌పై తీసుకొచ్చిన బైక్ డ్రైవర్ సైతం పరారయ్యాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మల్కన్‌గిరి: సంఘటన స్థలంలో అంజాన్ చౌదరి మృతదేహం



మల్కన్‌గిరి: ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

చెట్టును ఢీకొన్న కారు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి సింగాల్ బచ్చి గ్రామం వద్ద మంగళవారం ఉదయం ఒక కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మత్తిలి సమితి పంగం గ్రామానికి చెందిన తాపాస్ కుమార్ మిత్ర (26) సొంత పనిమీద జగదల్‌పూర్ వెళ్లడం కోసం కారులో బయల్దేరాడు. అయితే బయల్దేరిన కొద్దిసేపటికే ప్రమాదం జరగడంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యాధికారి మృతి



జయపురం/కొరాపుట్: ప్రమాద స్థలంలో టిప్పర్, యువకుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి అదనపు విద్యాధికారి అంజాన్ కుమార్ చౌదరి (59) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం మల్కన్‌గిరి నుంచి చిత్రకొండకు విధుల నిమిత్తం వెళ్తున్న అంజాన్ కుమార్ చౌదరి సహ ఉద్యోగి గాయత్రీ దేవిని సైతం తన ద్విచక్ర వాహనంపై తీసుకొని వెళ్తున్నారు. ఖోయిర్‌పూట్ సమితి మీదుగా ప్రయాణం చేస్తుండగా కుడుములగుమ్మ పంచాయతీ హతిఅంబో గ్రామం దగ్గరలో ఒక మలుపు వద్ద బైక్‌ను ఆపారు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన ఒక బైక్ వెనుక నుంచి అంజాన్ కుమార్ చౌదరి బైక్‌ను ఢీకొంది. దీంతో అంజాన్ చౌదరి, గాయత్రీ దేవి కిందపడ్డారు. అంజాన్ తలకు తీవ్రగాయం కావడంతో వెంటనే స్థానికులు ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రానికి ఇద్దరినీ తరలించారు. అక్కడ వారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే అంజాన్ చౌదరి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

4న నీలమణిదుర్గ ఆలయంలో తలనీలాల వేలం

పాతపట్నం : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ ఆలయంలో జూలై 4న మధ్యాహ్నం మూడు గంటలకు తలనీలాల బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈవో టి.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 జూలై 13 నుంచి 2024 జూలై 3 వరకు అమ్మవారికి సమర్పించిన తలనీలాలకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పైనాపిల్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గిరిజన యువతకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఎక్కువగా లభ్యమయ్యే పైనాపిల్ పండ్లతో స్క్వాష్ జామ్ వంటి ఉత్పత్తులు తయారు చేయవచ్చన్నారు. వీటి ద్వారా ఆర్థికాభ్యున్నతి సాధించవచ్చన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వెలుగు అసోసియేషన్ సంస్థ, ఆదివాసీ రైతు ప్రగతి గ్రూపు తరఫున 20 మంది శిక్షణ పొందారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలవేణి, డాక్టర్ వి.హరికుమార్, డాక్టర్ ఎస్.అనూష ,డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ ఎస్.ఆనంద్, వసంత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలుడికి రక్తదానం



బ్లడ్ ప్యాకెట్ అందజేస్తున్న అభయం యువజన సేవా సంఘం ప్రతినిధి శ్రీనివాస్

టెక్కలి : టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ అనాథ బాలుడికి పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం అండగా నిలిచింది. కాశీబుగ్గకు చెందిన గొల్లూరు రాజేష్ అనే ఆరేళ్ల బాలుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో అత్తయ్య మోహిని వద్ద ఉంటున్నాడు. ఇటీవల ఆడుకుంటూ పడిపోవడంతో కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. అత్యవసరంగా ఏ-పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు చెప్పడంతో విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్ సకాలంలో స్పందించి అవసరమైన రక్తాన్ని సమకూర్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు గనగళ్ల మోహన్‌దాస్ దత్తా, రామారావు శ్రీకాకుళంలో పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైకుపై ఉన్న ఇద్దరికీ గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ క్లీనర్‌కు..

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న లారీని మంగళవారం విశాఖపట్నం వైపు వెళ్తున్న మరో లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్యాబిన్‌లో ఉన్న లారీ క్లీనర్ కనకరాజు గాయపడ్డారు. ఈయన స్వస్థలం భీమిలి. క్షతగాత్రుడు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

బూర్జ: నగదు రహిత లావాదేవీలు, డిజిటల్ అక్షరాస్యతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఏపీ జీవీబీ బ్రాంచి మేనేజర్ కె.సతీష్ అన్నారు. బూర్జ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం డ్వాక్రా మహిళలు, వెలుగు సీఎఫ్‌లు, వెలుగు సీసీలు, సిబ్బందికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాక్టు మేనేజర్ వి.అశోక్‌మార్ పర్యవేక్షణలో డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.బాబూరావు, ఎంపీటీసీ పోలినాయుడు, సర్పంచ్ ఏగు అనూరాధ, ఏఎస్సై ఎం.వి.రమణ, వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్ ఎ.హరనాథ్, ట్రైనర్లు యు.రాజేష్, బి.చంద్రశేఖరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజిత బడ్జెట్ రూపొందించాలి

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



సీఎం మోహన్ చరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రజా ప్రయోజిత బడ్జెట్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంబంధిత అధికారులకు మంగళవారం సూచించారు. ప్రణాళిక అండ్ కన్వర్జెన్స్ విభాగం కార్యకలాపాలను సమీక్షిస్తూ ముఖ్యమంత్రి ఈ సూచనను జారీ చేశారు. కొత్త ప్రభుత్వంపై ప్రజలు భారీ అంచనాలతో ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రణాళిక బడ్జెట్‌లో తప్పనిసరిగా ప్రతిబింబించాలన్నారు. ప్రభుత్వ ప్రజాహిత పథకాలు సక్రమంగా అట్టడుగు స్థాయికి చేరి ప్రజలకు లబ్ధి చేకూరేలా దృష్టి సారించాలని అధికారులకు ప్రత్యేకంగా ఆదేశించారు. ఖనిజ నిధిని సక్రమంగా వినియోగించాలని ఒత్తిడి చేశారు. ఆ నిధుల సాయంతో ఖనిజాలు ఉన్న జిల్లాల్లో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాల్లోని వైద్య కళాశాలల్లో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆయన నొక్కి చెప్పారు.

హామీలకు అనుగుణంగా...

భారతీయ జనతా పార్టీ ఎన్నికల హామీల్లో చేసిన వాగ్దానాలకు కట్టుబడి ప్రత్యేక ప్రణాళికలను కొత్త బడ్జెటులో ప్రవేశ పెట్టడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఇటీవలి బీజేపీ మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసిన పశ్చిమ ఒడిశా అభివృద్ధి మండలి (డబ్ల్యూఓడీసీ)కి అనుగుణంగా ఉత్తర అభివృద్ధి మండలి, దక్షిణ ఒడిశా అభివృద్ధి మండలి ఏర్పాటుకు అనుబంధ విభాగాలకు ఆదేశించారు. ఈ మండళ్ల ఏర్పాటు కోసం నియమ నిబంధనలు, ఇతరేతర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి తదనంతర అధ్యయనం ఆధారంగా ఉత్తర, దక్షిణ ఒడిశా అభివృద్ధి మండళ్ల ఏర్పాటు సన్నాహాలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా పార్టీ ఎన్నికల హామీల ప్రధాన వాగ్దానాలను పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ కమ్ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అనూగర్గ్ మరియు ప్రణాళిక అండ్ కన్వర్జెన్స్ విభాగం ఇతర సీనియర్ అధికారులు ప్రజా ప్రయోజన బడ్జెటు రూపకల్పనకు సంబంధించి ముఖ్యమంత్రికి పలు అంశాలను ప్రతిపాదించారు.

'నబరంగ్‌పూర్ అభివృద్ధికి కృషి'



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి

కొరాపుట్: నబరంగ్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిపొందిన తర్వాత తొలిసారి వచ్చి అన్ని విభాగాల పనితీరు తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలోని డ్రైనేజీల పనితీరు మెరుగుపరచాలన్నారు. రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పౌర సరఫరా విభాగం ద్వారా బియ్యం సరఫరా సక్రమంగా జరగాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కును నాయక్, ఈవో శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్ బిషోయి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం



విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు



కుక్కకాటుకి గురైన బైక్‌పై వెళ్లే వ్యక్తి

జయపురం: పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతి వీధిలోనూ గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణంలో దాదాపు 5 వేలకు పైగా ఊర కుక్కలు ఉన్నట్లు అనధికార వర్గాల అంచనా. కుక్కల వలన పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారు. ప్రతిరోజూ ఒకరి నుంచి ఇద్దరు కుక్కకాటుకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని వెంబడిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గత మే నెలలో కుక్క కాటులకు గురైన వారు 280 మంది కాగా, అంతకు ముందు 644 మంది ఉండగా మొత్తం 924 మందికి రాబిస్ ఇంజెక్షన్లు ఇచ్చారు. అయితే ఇంత జరుగుతున్నా కుక్కల నియంత్రణ విషయంలో మున్సిపాలిటీ అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'జూలై మొదటి వారంలో వన మహోత్సవాలు'



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాస్థాయిలో జూలై మొదటి వారంలో వన మహోత్సవాలు నిర్వహించాలని డీఆర్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డా.గుణనిధి నాయక్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఏక్ పేడ్ మాకే నాం' (ఒక్క మొక్క అమ్మపేరుతో) అనే నినాదంతో జిల్లాలో పని చేస్తున్న మండల స్థాయి విద్యాధికారులు, హెచ్‌ఎంలు, ఇతర మిషన్ శక్తి మహిళా స్వయం సహాయక గ్రూపులతో సమావేశమయ్యారు.

ప్రతీ పాఠశాలలో మొక్కలు విరివిగా నాటాలని పిలుపునిచ్చారు. గుసాని, కాశీనగర్, గుమ్మా, రాయఘడ, నువాగడ, ఆర్.ఉదయగిరి, మోహనా సమితుల్లోని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్లు పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో డీఈవో మాయాధర్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ గుడిలో చోరీ

- కేజీన్నర వెండి ఆభరణాల అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. స్వామి ఉత్సవ విగ్రహానికి అలంకరించిన వెండి వస్తువులను అపహరించారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తాళాలు విరగ్గొట్టి లోపల ఉన్న వెండి ఆభరణాలు, కిరీటం, గద, వెండి సంజీవని పర్వతం, వెండి పాదాలు, శఠకోపం, వెండి పళ్లెం, హారం వంటివి దొంగతనం చేశారని అర్చకుడు శివ తెలిపారు. మంగళవారం సందర్భంగా సోమవారం రాత్రి స్వామి విగ్రహానికి ఆలయంలో ఉన్న వెండి వస్తువులు అలంకరించామని, వీటన్నింటినీ దొంగలు పట్టుకుపోయారని చెప్పారు. వేకువజామున ఆలయానికి వెళ్లేసరికి తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆలయం హుండీలో ఉన్న నగదు కూడా చోరీ చేశారన్నారు. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది.

సీఎస్‌గా మనోజ్ ఆహుజా..!

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ తదుపరి సీఎస్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి మనోజ్ ఆహుజా నియమితులయ్యే అవకాశం ఉంది. 6 నెలల పొడిగింపు తర్వాత ఈనెల 30తో ప్రదీప్ కుమార్ జెనా పదవీ కాలం ముగియనుంది. ఆయన తర్వాత మనోజ్ ఆహుజా బాధ్యతలు స్వీకరించనున్నారు. 1990 బ్యాచ్ ఒడిశా క్యాడర్ ఐఏఎస్ అధికారి మనోజ్ ఆహుజా ప్రస్తుతం కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు అతని మాతృ కేడర్‌కు తిరిగి రావడానికి కేంద్ర మంత్రి వర్గం నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ఆయన కేంద్రంలో సంయుక్త డైరెక్టర్ (సిబ్బంది ట్రైనింగ్, సిబ్బంది మరియు సాధారణ పాలన) మరియు రాష్ట్రంలో ఉక్కు మరియు గనులు, క్రీడలు, యువజన సేవల విభాగం కమిషనర్ మరియు కార్యదర్శి వంటి అనేక హోదాల్లో కీలకమైన బాధ్యతల్ని విజయవంతంగా నిర్వహించారు. లోగడ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ), విద్యాశాఖ చైర్మన్‌గా కూడా పని చేశారు. మనోజ్ ఆహుజా పాటియాలాలోని థాపర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి బీఈ (యాంత్రిక) డిగ్రీని, చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ, అమెరికా హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్)లో మాస్టర్స్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



ఘటనా స్థలంలో సింహాచలం మృతదేహం

జలుమూరు: మండలంలోని జోనంకి పంచాయతీ అబ్బాయిపేట జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాణ గ్రామానికి చెందిన వాన సింహాచలం(70) తలతరియా లింగాలుపాడులోని తన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అబ్బాయిపేట జంక్షన్ మలుపు వద్దకు వచ్చేసరికి పాతపట్నం నుంచి నరసన్నపేట వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, కుమారులు లింగమూర్తి, గోపాలరావు, కుమార్తె జ్యోతి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ఆస్పత్రికి తరలించారు. చిన్నకుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు పునరుద్ధరించాలి



ఉప్పుశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

సంతబొమ్మాళి: ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే ఉప్పు ఉత్పత్తిదారుల లీజులను పునరుద్ధరించాలని రాష్ట్ర ఉప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు పీరుపల్లి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉప్పు పరిశ్రమశాఖ కమిషనర్ ప్రేరణ జోషికి కాకినాడలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. 2013 నుంచి ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు నిలిచిపోవడంతో వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, దీంతో లైసెన్సుదారులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. లీజులు పునరుద్ధరించడంతో పాటు అసైన్మెంట్ ఫీజులు తగ్గించాలని కోరారు. టెండర్ విధానంలో ఉప్పు భూములు అప్పగించాలని విన్నవించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉప్పు సాగు ఆశించిన స్థాయిలో లేదని, రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే లీజులు పునరుద్ధరణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మాచారావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బురదల పోలమ్మ నిమజ్జనోత్సవం నేడు



పూజలందుకుంటున్న బురదల పోలమ్మ అమ్మవారు



నాయుడు, నాయురాళ్ల వేషధారణలు



అసర్లు ఘట్టంలో...



పూజారి నృత్యం

రాయగడ: ఈనెల 17వ తేదీ నుంచి కొనసాగుతున్న గ్రామ దేవత బురదల పోలమ్మ ఉత్సవాల్లో భాగంగా సాంప్రదాయంగా నిర్వహిస్తున్న ప్రధాన ఘట్టాలు మంగళవారంతో ముగిశాయి. మశూచి మహమ్మారి కట్టడికి గుర్తుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీనిలో ప్రధాన ఘట్టాలైన పాలధార, నీలధార, నాయుడు, నాయురాలు, ఉయ్యాల కంబాల, అసర్లు, ఊరు కట్టడి వంటివి ముగిశాయి. దీంతో బుధవారం అమ్మవారి నిమజ్జనోత్సవాలు జరుగుతాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డులో పూజలందుకుంటున్న అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను తిరిగి యథావిధి స్థానాలకు తీసుకెళ్లడంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఘట్టం బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది.

అధ్వానంగా బైపాస్ రోడ్డు



గోతులమయంగా మారిన రహదారి

రాయగడ: స్థానిక సాయి ఇంటర్నేషనల్ నుంచి కొరాపుట్ కూడలికి అనుసంధానంగా ఉండే బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. ప్రతి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు ఈ రహదారి మీదుగా కొరాపుట్, నవరంగపూర్, కాసీపూర్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటాయి.

అయితే ఈ రహదారి గోతులమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందువలన రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

28న ఓజేయూ రాష్ట్రస్థాయి సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న ఓజేయూ ప్రతినిధులు

జయపురం: పట్టణంలో జూలై 28వ తేదీన ఒడిశా జర్నలిస్టు యూనియన్(ఓజేయూ) రాష్ట్రస్థాయి సమ్మేళనం నిర్వహించేందుకు కొరాపుట్ జిల్లా శాఖ తీర్మానించింది. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఓజేయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి, నవరంగపూర్ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రస్థాయి సమ్మేళనం విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి 300 మందికి పైగా జర్నలిస్టు ప్రతినిధులు పాల్గొంటారని శ్రీనివాసరావు వెల్లడించారు.

సమ్మేళనం వేదిక, వచ్చేవారికి వసతి, భోజన సౌకర్యాల ఏర్పాటు, ముఖ్య అతిథితో పాటు ఇతర అతిథులకు ఆహ్వానాలు, ఆర్థిక వనరులు మొదలగు విషయాలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర శాఖ కార్యదర్శి నృశింహ బ్రహ్మ, మల్కన్‌గిరి శాఖ అధ్యక్షుడు దుర్యోధన పాత్రో, సలహాదారు సింహాచల పాణిగ్రహి, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ దాస్, కోశాధికారి హృషికేష్ సెఠి, నవరంగపూర్ జిల్లా అధ్యక్షుడు హృషికేష్ మిశ్ర, కార్యదర్శి ధీరెన్ పండ, దేవీ పట్నాయిక్, కరేష్ చంద్ర ఉపాశి, కొరాపుట్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు జయసింహ సెట్టి, సుదర్శన సేనాపతి, మనోజ్ దాస్, శుభ నారాయణ మహంతి, చిత్తరంజన్ చౌదరి, మధుసూదన పాత్రో, పి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో మార్పులు తప్పనిసరి

- అంబేడ్కర్ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ రజిని



వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. ఎచ్చెర్లలో మంగళవారం వర్సిటీ 17వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సెమినార్ హాల్లో నిర్వహించిన వ్యవస్థాపక వేడుకల సభలో మాట్లాడారు. వర్సిటీలో ప్రస్తుతం అనేక సవాళ్లు ఉన్నాయని, రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా చెప్పారు. అయినా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను సైతం ఎదుర్కొని ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అన్ని కోర్సులు బలోపేతం చేయడం, నూతన విద్యా విధానానికి అనుగుణంగా బోధించడంపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య మాట్లాడుతూ వర్సిటీ కోసం రెండు దశాబ్దాలు ప్రజా సంఘాలు, మేధావులు పోరాటం చేసిన అంశాన్ని గుర్తు చేశారు. 2008 జూన్ 25న జిల్లాలో విశ్వవిద్యాలయం అవసరం గుర్తించి వర్సిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో పూర్తిస్థాయిలో వర్సిటీ ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మాట్లాడుతూ సీనియర్ విశ్వవిద్యాలయాలతో పోటీపడి విద్యనందిస్తుందన్నారు. అనంతరం వసతి గృహం సిబ్బందికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖరరావు, డీన్‌లు డాక్టర్ కె.స్వప్నవాహిణి, డాక్టర్ యు.కావ్య జ్యోత్స్న, చీఫ్ వార్డెన్ ఎన్.లోకేశ్వరి, పాలక మండలి సభ్యులు కె.మాధవి, కె.చక్రపతి పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాల రవాణాపై నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : నిషేధిత పదార్థాలను సాధారణ వస్తువుల మాదిరిగా ప్యాకింగ్ చేసి రవాణా చేసేందుకు ప్రయత్నించేవారి వివరాలు తెలిస్తే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు తెలియజేయాలని సెబ్ ఈఎస్ తిరుపతినాయుడు కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెబ్ అదనపు ఎస్పీ (జేడీ) డి.గంగాధరం ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని న్యూకాలనీలో ఉన్న సెబ్ స్టేషన్‌లో మంగళవారం పార్సిల్, ట్రాన్స్‌పోర్ట్, ట్రావెల్స్ బుకింగ్ సెంటర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యాలయం వద్ద సీసీ కెమెరాలు అమార్చాలని, కస్టమర్ మొబైల్ నంబర్, డెస్టినేషన్ పాయింట్ మొబైల్ నంబర్ విధిగా తీసుకోవాలన్నారు. పార్సిల్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే రవాణాకు అనుమతించాలని స్పష్టం చేశారు. నిషేధిత పదార్థాల జాబితా బోర్డును కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో ఏఈఎస్ ఎం.వినీషా, సీఐ ఎం.వి.గోపాలకృష్ణ, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బదిలీ కలెక్టర్‌ను సత్కరించిన మంత్రి



కలెక్టర్‌ను అభినందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొంపల్లి శ్రీనివాస్ దుశ్శాలువతో సత్కరించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు మంత్రి శ్రీనివాస్ కలెక్టర్ నాగలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు.

నేటికీ అందని విద్యా సామగ్రి



చిరిగిన బ్యాగులు

నెల్లిమర్ల రూరల్: పాఠశాలలు పునఃప్రారంభమై పదిరోజులైన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఏకరూప దుస్తులు నేటికీ అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినప్పటికీ బ్యాగులు, ఏకరూప దుస్తులు అందించకపోవడంతో చినిగిన బ్యాగులు, దుస్తులతోనే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా పాఠశాలల ప్రారంభం నాడే విద్యార్థులకు బ్యాగులు, యూనిఫారం, ఇతర సామగ్రిని విద్యాశాఖ ద్వారా అందించేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 42 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుండగా.. అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. త్వరలోనే విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.


29 కిలోల గంజాయి సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

విజయనగరం క్రైమ్: రైల్వేస్టేషన్ పరిధిలో ప్లాట్‌ఫామ్‌ల తనిఖీల్లో రూ.లక్షా 45 వేల విలువైన గంజాయిని జీఆర్‌పీ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ సిబ్బంది మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అన్నూ, శివ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.లక్షా 45 వేల విలువైన 29 కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను వెలికితీయడంలో విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీసు ప్రత్యేక టీమ్‌ల సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటుచేసి విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు విస్తృతం చేశామన్నారు. సమావేశంలో రైల్వే ఎస్సై రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు మేలుచేసిన వైఎస్సార్



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ వైద్యులకు మేలుచేసిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎస్.కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన గ్రామీణ వైద్యుల సంఘం ఆత్మీయ కలయిక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వడం కోసం జీఓ 429ను జారీచేశారని చెప్పారు. ఆయన అకాల మరణం గ్రామీణ వైద్యులకు తీరని లోటుగా పేర్కొన్నారు. వెంకటరామ ఆస్పత్రి ఎం.డి చిట్టి రమణరావు మాట్లాడుతూ పరిమితికి మించి గ్రామీణ వైద్యులు వైద్యం చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం గౌరవాధ్యక్షుడు ఐ.గోపాలరావు, ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.ఎస్.శర్మ, కోశాధికారి వై.సోమేశ్వరి, కనకచారి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బరువైన ఎరువు

- సతమతమవుతున్న అన్నదాత
- అమాంతం పెరిగిన ధర
- పంటకు గిట్టుబాటు లేక రైతు అప్పుల పాలు
- సేంద్రియ వ్యవసాయం చేయాలని వ్యవసాయాధికారుల సూచన



ఓ షాపులో నిల్వ ఉన్న ఎరువులు

పూసపాటిరేగ: దేశానికి అన్నంపెట్టే రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి వ్యయం పెరుగుతుండడం, గిట్టుబాటు ధరలేకపోవడంతో అప్పుల పాలవుతున్నాడు. పెరిగిన ఎరువుల ధరలు రైతులను మరింతగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పెట్టుబడి వ్యయం పెరిగిపోవడంతో వ్యవసాయం చేయడానికి రైతులు సంశయిస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో రసాయిన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. పూసపాటిరేగ మండలంలో 7200, డెంకాడ మండలంలో 6400, భోగాపురం మండలంలో 5300, నెల్లిమర్ల మండలంలో 6700 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఎరువుల ధర గణనీయంగా పెరగడంతో సాగు ఎలా చేయాలోనని రైతులు మథన పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీతో ఎరువుల ధర 5 శాతం , పురుగు మందుల ధర 18 శాతం పెరిగింది. పెరిగిన ధరలతో రైతులు బెంబేలెత్తుతుంటే ఎరువుల కంపెనీలు మరో 10 శాతం ధర పెంచాయి. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంట దిగుబడి పెంచేందుకు రసాయన ఎరువులు వాడకం అమాంతం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ఎరువుల ధర కొండెక్కడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో పాటు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి. సేంద్రియ ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపాలి. పశువుల పేడతో పాటు జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు పొలంలో వేసి కలియదున్నాలి. దీంతో రసాయన ఎరువులు, పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం ఉండదు.
– కె. నీలిమ, వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

గతంలో పశువుల పేడ, పచ్చిరొట్ట ఎరువుల వాడకం అధికంగా ఉండేది. కానీ కాలక్రమేణా పోటీ తత్వంతో రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. మితిమీరి రసాయన ఎరువుల వాడకం వల్ల వాతావరణంలో కాలుష్యంతో పాటు, ఎరువులతో పండించిన పంటలు తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

3.20 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్

- జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో గత ఖరీఫ్‌లో మాదిరిగానే ఈ ఖరీఫ్‌లో కూడా 3.20 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురం వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఖరీఫ్ పంటల సాగులో రైతులకు అందించవలసిన సేవలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఒక లక్ష ఎకరాల్లో ఉంటే.. వరి, ఇతర పంటలు 2.20 లక్షల ఎకరాల్లో సాగవనున్నాయన్నారు. జిల్లాలో గల 306 రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందస్తుగానే 22,131 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఇప్పటివరకు 19వేల క్వింటాళ్ల వరి విత్తనాలను 32,439 మంది రైతులకు 90 శాతం రాయితీపై, 1900 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను 6,600 మంది రైతులకు 90 శాతం రాయితీపై అందించినట్లు చెప్పారు. 19,000 టన్నుల ఎరువులను ఆర్బీకేలు, సొసైటీలు, వ్యాపారుల వద్ద సిద్ధంగా ఉంచామన్నారు. యూరియా బస్తా రూ.266.50, డీఏపీ బస్తా రూ.1350, కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.1470, 2020213 బస్తా రూ.1250, 28280 బస్తా రూ.1700, పొటాష్ బస్తా రూ.1625, సూపర్ ఫాస్ఫేట్ బస్తా రూ.600, బి.రకం బస్తా రూ.64లు చొప్పున ధర నిర్ణయించామని వివరించారు. రైతులంతా ఈ ధరలకు మించి ఎరువులను కొనుగోలు చేయరాదని పిలుపునిచ్చారు. జిల్లాలో 11,000 మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపామని, జూలై నెలాఖరులోగా భూసార పరీక్ష ఫలితాలు వస్తాయన్నారు. ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలని రైతులను కోరారు. ఆయన వెంట కురుపాం ఎ.డి నిర్మల జ్యోతి, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల వ్యవసాయాధికారులు సీహెచ్ ప్రసాద్, పి. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు



డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: డయేరియాపై స్పందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తుందని చెప్పారు. గత ఏడాది దత్తిరాజేరు మండలంలోని పెదకాద, డెంకాడ మండలంలోని పెదతాడివాడ, చినతాడివాడ, నెల్లిమర్ల మండలం ఏటీ అగ్రహారం, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందిందని, ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నలుగురు సభ్యులు ఉంటారని, అదేవిధంగా పీహెచ్‌సీలో కూడా డయేరియాపై ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందినట్లయితే ఆ కమిటీకి తెలియజేయాలని చెప్పారు. కేసులు ఎక్కువ నమోదైతే జిల్లా కేంద్రంలో ఉన్న కమాండ్‌కంట్రోల్ రూమ్‌కు తెలియజేస్తారని చెప్పారు.

వృద్ధురాలికి పాముకాటు

వంగర: మండల కేంద్రం వంగరకు చెందిన వృద్ధురాలు దేవకివాడ తులసమ్మ మంగళవారం పాముకాటుకు గురైంది. ఇంటిలో పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో హుటాహుటిన వంగర పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రాజాం సీహెచ్‌సీకి తరలించారు. ఆమె కోలుకుంటోందని కుటుంబసభ్యులు తెలిపారు.

చోరీ బంగారం రికవరీ: నిందితుడి అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సై యు.మహేష్

గజపతినగరం: బొండపల్లి మండల కేంద్రానికి చెందిన ఎం.సత్యం కోల్పోయిన బంగారాన్ని రికవరీ చేసినట్లు గజపతినగరం ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాసారపు సత్యం 14వ తేదీన తమ అవసరాల నిమిత్తం 63.18 గ్రాముల బంగారాన్ని బొండపల్లి గ్రామం నుంచి గజపతినగరంలోని ఓ బ్యాంక్‌లో తాకట్టు పెట్టేందుకు ఆటోలో బయలుదేరి వస్తున్నాడు. మార్గమధ్యంలో ఓ వ్యక్తి బంగారంతో ఉన్న బ్యాగ్‌ను పట్టుకుని పరారయ్యాడు. దీంతో పోలీస్ స్టేషన్‌లో అదే రోజు బాధితుడు సత్యం ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేసి మంగళవారం బంగారాన్ని దొంగిలించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగారాన్ని రికవరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ సత్యన్నారాయణ, దామోదర్‌లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో అనుమానాస్పదంగా ఒక వ్యక్తి మృతిచెందాడు. దీనిపై స్థానిక ఎస్సై వై.అమ్మన్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఏగిరెడ్డి వెంకటరమణ(47) సోమవారం తన పొలంలో పురుగు మందు పిచికారీ చేసి రాత్రి ఇంటికి వచ్చి మంచంపై పడుకున్నాడు. భార్య భవాని మంగళవారం తెల్లవారు జామున భర్తను చూసి చనిపోయినట్లు గమనించి చుట్టుపక్కల వారికి తెలియజేయగా వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం మేరకు పోలీసులు మంగళవారం ఘటనాస్థలానికి వచ్చి మృతిచెందిన వ్యక్తిని పరిశీలించి శరీరమంతా పలుచోట్ల గాయాలతో పాటు రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు వెంకటరమణ, భార్య భవానీల మధ్య కొంతకాలంగా చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయని పోలీసుల విచారణలో స్థానికులు చెప్పారు. మృతుడి కుమార్తె ధనుష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

విజయనగరం అర్బన్: జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) జిల్లా కమిటీ సభ్యులు ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు మంగళవారం విన్నవించారు. జెడ్పీ అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రవిచంద్రశేఖర్, జీవీఆర్‌గోపాల్ వర్మ, అల్లార రమణ, వాడాడ గోరీశంకర్, అరుణ్‌కుమార్, హేమంత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన క్రెడాయ్ ప్రతినిధులు



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసిన క్రెడాయ్ చాప్టర్ ప్రతినిధులు బోస్, తదితరులు

విజయనగరం టౌన్: క్రెడాయ్ విజయనగరం చాప్టర్ ప్రతినిధులు రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మంగళవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. క్రెడాయ్ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఉన్నందున చాప్టర్ తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు. నిర్మాణరంగానికి సంబంధించిన పలు విషయాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఏపీ వైస్ ప్రెసిడెంట్ కె.సుభాష్ చంద్రబోస్, చైర్మన్ వి.పార్థసారథి, అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, కార్యదర్శి రాజశేఖర్, చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ అధికారిని నియమించండి

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో పనిచేసిన అధికారి ఉద్యోగ విరమణ చేసి రెండు నెలలవుతున్నా ఇంతవరకు రెగ్యులర్ అధికారిని నియమించలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరారు.

చాలీచాలని భోజనం



భోజనం లేదంటూ ఖాళీ కంచాలు చూపుతున్న విద్యార్థులు

- అర్ధాకలితో విద్యార్థులు
- మధ్యాహ్నభోజన నిర్వాహకుల నిర్వాకం
- ఆగ్రహం వ్యక్తంచేసిన తల్లిదండ్రులు



నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నభోజన పథకంపై అజమాయిషీ కొరవడింది. ఫలితం.. విద్యార్థులు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. బొబ్బిలి మండలం పిరిడి ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు వండాలి. కేవలం 200 మందికి సరిపడా వంటలు మాత్రమే మంగళవారం చేశారు. పులిహోరాతో పాటు గుడ్డును విద్యార్థులకు పెట్టాల్సి ఉండగా, 60 మంది విద్యార్థులకు గుడ్లు లేవు. మరో 50 మంది విద్యార్థులకు పులిహోరా భోజనం కూడా వండలేదు. విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని మధ్యాహ్నభోజన నిర్వాహకులు, హెచ్ఎం మధుసూదనరావును ప్రశ్నించారు. కొద్దిరోజులుగా కడుపునిండా భోజనం పెట్టడంలేదని పిల్లలు చెబుతున్నారని, దీనికి సమాధానం చెప్పాలని నిలదీశారు. సర్కారు బడుల్లో చదివే పిల్లలపై చిన్నచూపు తగదంటూ మండిపడ్డారు. భోజన నిర్వాహకులకు సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలే తప్ప పిల్లలను ఆకలితో ఉంచడం మంచిది కాదన్నారు. తల్లిదండ్రుల ఆందోళన చేయడంతో అప్పటికప్పుడు మిగిలిన విద్యార్థులకు గుడ్లు, పులిహోరా వండి వడ్డించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హెచ్ఎం తెలిపారు.

విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి

- ఆర్‌జేడీ విజయభాస్కర్
- ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఆర్‌జేడీ బి.విజయభాస్కర్



హాజరైన ప్రధానోపాధ్యాయులు

విజయనగరం అర్బన్: పాఠశాల విద్యలో విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులతో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. పాఠశాల మెరుగైన నిర్వహణ, విద్యార్థుల విద్యాప్రమాణాల పెంపు బాధ్యత ప్రధానోపాధ్యాయులు వహించాలని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన వాతావరణాన్ని పాఠశాలలో రూపొందించుకోవాలని హితవు పలికారు. బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు మెరుగుపరుచుకుంటూ విద్యాప్రమాణాల పెంపు జరగాలని ఆదేశించారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాల పంపిణీ పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈఓ ఎన్.ప్రేమకుమార్, డిప్యూటీ డీఈఓలు కె.మోహనరావు, కె.వెంకటరమణ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్ట్

- పరారీలో ఉన్న వారి కోసం గాలింపు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: కిడ్నాప్ కేసులో నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దకినీవీధిలో రాజస్థాన్‌కు చెందిన భగవాన్ రామ్ గ్యాస్ స్టవ్‌ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న భగవాన్ రామ్ ఉండే ప్రాంతానికి రాజస్థాన్ నుంచి బిజిలారామ్, కొంతమంది వ్యక్తులు వచ్చి, అతనితో మాట్లాడి, కారులో ఎక్కించుకుని వై జంక్షన్‌కు వద్దకు తీసుకువెళ్లి, అక్కడ మద్యం తాగి, తమ ఆడవారికి అసభ్యకర మెసెజ్‌లు పంపిస్తున్నాడనే నెపంతో భగవాన్‌రామ్‌ను తీవ్రంగా కొట్టి, బలవంతంగా కారులో బెంగళూరు తీసుకువెళ్లేందుకు బయల్దేరారు. మార్గమధ్యంలో కారు ఆపి, ఒక బాటిల్‌లో మూత్రం పట్టి బలవంతంగా తాగించి, వీడియో రికార్డ్ చేశారు. అతని స్నేహితుడికి ఫోన్ చేయించి బలవంతంగా రూ. 35 వేలు తీసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి, భగవాన్‌రామ్‌ను విడిచిపెట్టి పరారయ్యారు. భగవాన్‌రామ్ విజయనగరం చేరుకుని ఎటువంటి ఫిర్యాదు చేయకుండా ఉన్నాడు. నిందితులు తీసిన వీడియోలను రాజస్థాన్‌లో వైరల్ చేశారు. ఈ విషయం భగవాన్ రామ్‌కు తెలియడంతో జూన్ 22న ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు పోలీసులు నిందితుల్లో ఒకడైన దేవాసి వజీరామ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

6న గిరిజన వర్సిటీ పీజీ జర్నలిజం కోర్సులో స్పాట్ అడ్మిషన్

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ పీజీ కోర్సులకు జూలై 6న స్పాట్ ఎడ్మిషన్లు నిర్వహిస్తామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రిజర్వేషన్ల కోటాలోనూ సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి, అర్హులైన విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు వర్సిటీ క్యాంపస్ ప్రాంగణానికి నేరుగా హాజరుకావాలని కోరారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్‌లు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి వేదాశీస్సులు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

- బాధ్యతల చేపట్టిన కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్న అయనకు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, ఆర్డీఓ సూర్యకళ, వివిధ విభాగాల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్లోకి ఆయన ప్రవేశించి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడిపిస్తానని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానన్నారు. గతంలో వివిధ హోదాల్లో జిల్లాలో పనిచేశానని, జిల్లా పరిస్థితులపై కొంతవరకు అవగాహన ఉందని తెలిపారు.

నేడు సీజనల్ వ్యాధులపై కలెక్టర్ తొలి సమీక్ష

సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వైద్యారోగ్యశాఖ, పంచాయతీ, తాగునీటి సరఫరా తదితర శాఖల అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ కె.కార్తీక్